
# ప్రజా సమస్యల పరిష్కారమే అధికారుల లక్ష్యం కావాలి

**: ఎమ్మెల్యే జీ.ఎం.ఆర్. మధుసూదన్ రెడ్డి**




జాతీయ తెలుగు దినపత్రిక



# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం


## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





శుక్రవారం, ఆగస్టు 7, 2026 పేజీలు :7



### పరీక్షల గడప వద్దే విద్యార్థుల భవిష్యత్తుకు

# ‘ప్రశాంతి నికేతన్’ తాళం..?

- “పరీక్ష హాల్ తలుపులు మూసి... ఫీజుల తలుపులు తెరిచి!”
- “విద్యాలయమా... వాణిజ్యశాలా?”
- “40 మంది పిల్లల కన్నీళ్లు యాజమాన్యం అహంకారం”
- “ర్యాంకుల పోస్టర్లు పెద్దవి... విద్యార్థుల మనసులు చిన్నవయ్యాయా?”
- “ఫీజులు చెల్లించకపోతే పరీక్షలే లేవా.?”
- ప్రశాంతి నికేతన్ వివాదం మరో మలుపు
- జిల్లా లీగల్ సెల్‌ను ఆశ్రయించిన విద్యార్థి తండ్రి

**మహబూబ్ నగర్ ఆగస్టు 6 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** విద్యార్థులను పరీక్షలు రాయకుండా అడ్డుకోవడం, తోటి విద్యార్థుల ఎదుట అవమానించడం, మానసిక వేదనకు గురిచేయడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా కేంద్రం, బి కే రెడ్డి కాలనీ లో ఉన్న “ప్రశాంతి నికేతన్ హై స్కూల్” వ్యవహారం రోజురోజుకూ కొత్త మలుపులు తిరుగుతోంది. ఈ ఘటనపై ఇప్పటికే పలు దినపత్రికల్లో కథనాలు వెలువడగా, తాజాగా బాధిత విద్యార్థి తండ్రి ఖాజా మొయినుద్దీన్ జిల్లా లీగల్ సెల్ అడ్వైజర్‌కు గురు వారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఫిర్యాదులో, పాఠశాల యాజమాన్యం దాదాపు 40 మంది విద్యార్థులను పరీక్షలకు అనుమతించకుండా, తోటి విద్యార్థుల ఎదుట చులకనగా మాట్లాడి మానసికంగా కుంగదీసిందని ఆరోపించారు. ఈ ఘటన వల్ల

### మహిళా శక్తి క్యాంటీన్‌లో నాణ్యమైన ఆహారం, పరిశుభ్రతకు

# ప్రాధాన్యం ఇవ్వాలి

## మహబూబ్‌నగర్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, ఆగస్టు 6 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** కలెక్టర్ కార్యాలయంలోని మహిళా శక్తి క్యాంటీన్‌లో పరిశుభ్రత, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పష్టం చేశారు. గురువారం ఆమె మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్వహణ, ఆహార నాణ్యత, పరిశుభ్రత, భోజన



### రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళా సంఘాలు ఆర్థికంగా

# బలోపేతం కావాలి

## గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



# ప్రజా సమస్యల పరిష్కారమే అధికారుల లక్ష్యం కావాలి

అడ్డాకుల, ఆగస్టు 6 (ప్రజా జ్యోతి):
ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని నారాయణపేట ఎమ్మెల్యే గావినోళ్ల మధుసూదన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం అడ్డాకుల మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన మండల సర్వసభ్య జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వివిధ ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షించారు. సమావేశంలో రెవెన్యూ, వ్యవసాయం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ, విద్య, వైద్య ఆరోగ్యం, విద్యుత్, హౌసింగ్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా, పశుసంవర్ధక, ఆర్అండ్బీ, ఉద్యానవన, ఇరిగేషన్, అటవీ, వెటర్నరీ తదితర శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో సర్పంచులతో అధికారులు సమన్వయంగా పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, రెవెన్యూ శాఖ ప్రజల భూ సమస్యలు, దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు.
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో అడ్మిషన్లు పెరుగుతున్నాయని పేర్కొంటూ విద్యా రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఉపాధి హామీ పథకం కింద కొత్త పనులపై సర్పంచులకు అవగాహన కల్పించి, ప్రతి గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, రానున్న సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు త్వరలో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల పంపిణీ కార్యక్రమాన్ని మండలాల వారీగా చేపడతామని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి గ్రామంలో తాగునీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. గ్రామస్థాయిలో పశువైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని, పరిశుభ్రత, పారిశుధ్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. రోడ్లు, భవనాల నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని, ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహిస్తూ రైతులకు అవగాహన కల్పించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. విద్య, వైద్యం, సాగునీరు వంటి కీలక రంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రతి శాఖ సర్పంచులతో నిరంతర సంబంధాలు కొనసాగించేలా ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని సర్పంచులకు సూచించారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే జీ.ఎం.ఆర్. మధుసూదన్ రెడ్డి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### మహిళా శక్తి క్యాంటీన్‌లో నాణ్యమైన ఆహారం, పరిశుభ్రతకు

# ప్రాధాన్యం ఇవ్వాలి

ఏర్పాట్లను పరిశీలించారు. తనిఖీ సందర్భంగా క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. అందిస్తున్న ఆహారం నాణ్యతపై వారి అభిప్రాయాలను తెలుసుకుని, ఏవైనా ఇబ్బందులు లేదా ఫిర్యాదులు ఉన్నాయా అని ఆరా తీశారు. కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు, ఉద్యోగులకు ఎల్లప్పుడూ పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని క్యాంటీన్ నిర్వాహకులకు సూచించారు. ఆహార నాణ్యతపై ఫిర్యాదులు వచ్చినా లేదా నాసిరకం ఆహారం అందిస్తున్నట్లు తేలినా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్యాంటీన్ నిర్వహణలో పరిశుభ్రత, ఆహార నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పష్టం చేశారు.

## నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, మైనర్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు: ట్రాఫిక్ పోలీసుల హెచ్చరిక

మహబూబ్‌నగర్, ఆగస్టు 6 ( ప్రజా జ్యోతి బ్యూరో ):



నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం, మైనర్లతో వాహనాలు నడిపించడం చట్టరీత్యా నేరమని మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు గురువారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం వల్ల ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలు, మైనర్లు వాహనాలు నడిపితే వారితో పాటు తల్లిదండ్రులు కూడా చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని వివరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి వాహనానికి నిబంధనలకు అనుగుణంగా స్పష్టంగా కనిపించే రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో నంబర్ ప్లేట్లు లేని వాహనదారులు, మైనర్ డ్రైవింగ్‌కు పాల్పడిన వారు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. సురక్షిత రవాణా కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను బాధ్యతగా పాటించాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పరీక్షల గడప వద్దే విద్యార్థుల భవిష్యత్తుకు ‘ప్రశాంతి నికేతన్’ తాళం..?

పిల్లలు తీవ్ర మనోవేదనకు గురయ్యారని, వారి విద్యా భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడిందని పేర్కొంటూ పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై మీడియాలో వరుస కథనాలు ప్రచురితమైనప్పటికీ, పాఠశాల యాజమాన్యం నుంచి అధికారికంగా స్పందన రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.
“విద్యాలయం అంటే విద్యను పంచే ఆలయం... కానీ పరీక్షల గేటు దగ్గరే పిల్లల కలలకు తాళం వేస్తే, అది ఆలయమా.? లేక వ్యాపార ధోరణి, లాభాపేక్షతో విద్యార్థుల పై అహంకారంతో కూడిన అధికారాన్ని ప్రదర్శించే కార్యాలయమా.?” అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యార్థులు సాధించిన ర్యాంకుల ప్రకటనలతో ప్రచారం పొందే సంస్థలు, అదే పిల్లల ఆత్మగౌరవాన్ని కాపాడడంలో కూడా అంతే శ్రద్ధ చూపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఒక విద్యార్థి మార్కులు తగ్గితే మళ్లీ రాయవచ్చు. కానీ అతని మనసుపై పడిన గాయం అంత సులభంగా మానదు.
జిల్లా లీగల్ సెల్‌ను ఆశ్రయించిన నేపథ్యంలో ఈ వ్యవహారం ఇప్పుడు చట్టపరమైన కోణంలోకి కూడా వెళ్లింది. సంబంధిత అధికారులు నిష్పాక్షికంగా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీసి, విద్యార్థుల హక్కులు పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.
“పరీక్ష రాసే హక్కు పిల్లలది... దాన్ని కాపాడే బాధ్యత పాఠశాల యాజమాన్యానిదే.” అని ఆ దిశగా స్వచ్ఛంద సంస్థలు, సొసైటీల ముసుగులో విద్యా వ్యాపారం చేసే, చేస్తున్న ప్రయివేటు పాఠశాలల తీరుకు చరమ గీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.!

# రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలి

గద్వాల ఆగస్టు 06(ప్రజా జ్యోతి ప్రతినిధి):మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకుల నుంచి పొందిన రుణాలను సద్వినియోగం చేసుకుని వ్యాపార, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవడం ద్వారా ఆర్థిక సాధికారత సాధించాలని గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన స్త్రీ నిధి జిల్లా కమిటీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.సెర్ప్,మెప్మా ద్వారా ప్రతి సంవత్సరం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నప్పటికీ,వాటిని ఎంతమంది సమర్థవంతంగా వినియోగించుకుంటున్నారనే అంశాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు.చిన్న స్థాయి వ్యాపారాలకే పరిమితం కాకుండా,ప్రస్తుతం మార్కెట్లో డిమాండ్ ఉన్న ఉత్పత్తుల తయారీ,విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై మహిళా సంఘాలు దృష్టి సారించాలని సూచించారు.పౌల్ట్రీ,డెయిరీ,ఫిషరీస్ తదితర రంగాల్లో మహిళా సంఘాల భాగస్వామ్యాన్ని పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రవాణా సౌకర్యాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో మహిళా సంఘాల సభ్యులు ఎలక్ట్రిక్ ఆటోలు, మినీ వ్యాన్లు వంటి వాహనాలను కొనుగోలు చేసి ఉపాధి పొందేలా ప్రోత్సహించాలని సూచించారు.పాత సంఘాలకే కాకుండా స్నేహ కమిటీలు,ఇతర మహిళా సంఘాల సభ్యులకు కూడా వడ్డీ లేని రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని,ఈ విషయంలో సీసీలు,ఏపీఎంలు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని తెలిపారు.జిల్లాలో 9,600కు పైగా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని,రుణాలు తీసుకుని చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సభ్యులు ఈ నెల 30వ తేదీలోగా బకాయిలు చెల్లించాలని హెచ్చరించారు. గడువులోగా చెల్లించని వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.రుణాల వసూళ్లలో పురోగతి సాధించేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు.మహిళా సంఘాలు తీసుకునే రుణాల సద్వినియోగానికి పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) రూపొందించాలని సూచించారు. అలాగే మహిళా సంఘాల ద్వారా కుట్టిస్తున్న విద్యార్థుల యూనిఫాంలను సకాలంలో అందజేసేలా ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు.గ్రామైక్య సంఘాల భవనాల నిర్మాణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఆర్డీఓ ముషాహిదా బేగం,ఏపీడీ శ్రీనివాస్,స్త్రీ నిధి జోనల్ మేనేజర్ రవికుమార్,రీజనల్ మేనేజర్ సందీప్,జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రభావతమ్మ,డీపీఎంలు,ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం...

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో అవగాహన కార్యక్రమం

మహబూబ్‌నగర్, ఆగస్టు 6
( ప్రజా జ్యోతి బ్యూరో ):
ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మహబూబ్‌నగర్ అర్బన్ పరిధిలోని 40వ డివిజన్‌లో గురువారం తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ సి.బి. శ్రీ పూజిత ముఖ్య అతిథిగా హాజరై తల్లిపాలు శిశువుకు తొలి పోషకాహారమని, పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం ద్వారా శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని తెలిపారు. తల్లిపాలతో పాటు సమతుల్య పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఇద్దరి ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. సీడీపీఓ రూపా మాట్లాడుతూ తల్లిపాల వల్ల శిశువుకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు ప్రసన్న, రాధిక, హెల్త్ సూపర్వైజర్ సుశీల, ఏఎన్ఎం అంజమ్మ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు కళారంజని, పద్మ, సువర్ణ, లలిత, వీణ, ప్రమీల పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. డివిజన్ సభ్యులు, స్థానిక మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఇంటర్ అధ్యాపకులకు జిల్లా స్థాయి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభం

**మహబూబ్‌నగర్, ఆగస్టు 6 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
ఇంటర్మీడియట్ విద్యను మరింత నాణ్యవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్ డీ పీ) గురువారం మహబూబ్‌నగర్‌లో ప్రారంభమైంది. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డి ఐ ఈ ఓ) రమణి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నోడల్ అధికారులుగా ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హెచ్. సుదర్శన్ రావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర) ప్రిన్సిపాల్ సయ్యద్ అలీముద్దీన్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు చెందిన తెలుగు, కామర్స్, హిస్టరీ, సివిక్స్ అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సవరించిన ఇంటర్మీడియట్ పాఠ్యాంశాలు, ఆధునిక బోధనా విధానాలు, ప్రాక్టికల్ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్, పరీక్షల సంస్కరణలు, ఇండస్ట్రీ లింకేజీలపై నిపుణులు అవగాహన కల్పించారు. అదేవిధంగా విద్యార్థి కేంద్రిత అభ్యాసం, సాంకేతికత ఆధారిత బోధన, విద్యా నాణ్యత పెంపు అంశాలపై



విస్తృతంగా శిక్షణ, చర్చలు నిర్వహించారు. ఈ శిక్షణ తమ బోధనా నైపుణ్యాలను మరింత మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఎంతో ఉపయోగపడుతుందని పాల్గొన్న అధ్యాపకులు అభిప్రాయపడ్డారు.

# హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

**చిన్నంబావి, ఆగస్టు 6 (ప్రజా జ్యోతి)**
చిన్నంబావి మండలం కొప్పునూర్ గ్రామంలోని ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్‌లో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు డా. రాజశేఖర్, డా. భాగ్యశ్రీ సహకారంతో నిర్వహించిన శిబిరంలో 61 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రజలకు వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, సురక్షితమైన తాగునీటిని వినియోగించడం ద్వారా అనారోగ్యాలను నివారించవచ్చని సూచించారు. వైద్యాధికారి డా. రాజశేఖర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో జ్వరం, డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు వ్యక్తిగత, పరిసరాల



పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ హాస్టల్ వార్డెన్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, హెల్త్ అసిస్టెంట్ జహంగీర్, ఏఎన్ఎంలు జయమ్మ, రమేశ్వరి, ఆశా కార్యకర్తలు ఈశ్వరమ్మ, సీత, యశోద తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి ప్రకృతిని కాపాడుదాం.

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**
పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మండల విద్యాధికారి నరసింహులు అన్నారు మండల పరిధిలోని తూముకుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏకో క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన స్వయంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా హరిత తెలంగాణ లక్ష్యాన్ని సహకారం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్రాంతి మురళి అంగన్వాడి టీచర్లు హెల్పర్లు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



# సార్ సేవలు చిరస్మరణీయం

## కొప్పునూర్‌లో ఘనంగా జయశంకర్ సార్ జయంతి

**చిన్నంబావి ఆగస్టు 6 (ప్రజా జ్యోతి)**
తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కె. జయశంకర్ సార్ జయంతి వేడుకలను చిన్నంబావి మండల పరిధిలోని కొప్పునూర్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వడ్డెమాన్ బిచ్చన్న జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఆయన జీవితాంతం చేసిన కృషి, ఉద్యమానికి అందించిన మేధోపరమైన దిశానిర్దేశం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. జయశంకర్ సార్ ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, వాటిని ఆచరణలో పెట్టి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుకలి శివరాముడు, ఉపాధ్యాయులు మధు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్ సార్ చేసిన నిరంతర పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు. నీళ్లు--నిధులు--నియామకాలు వంటి తెలంగాణ ఉద్యమ ప్రధాన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జయశంకర్ ఆశయాలను విద్యార్థులు తెలుసుకుని భవిష్యత్‌లో సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త భాజాభాను, వాలంటీర్ శ్రీవిద్య, ఆయా సునీత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఈవీఎంల భద్రతలో రాజీ లేదు..

## ఎన్నికల సంఘం నిబంధనలు కచ్చితంగా పాటించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్, ఆగస్టు 6( ప్రజా జ్యోతి బ్యూరో ):**
భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నెలవారీ తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని ఈవీఎం గోదాంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్, భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ నిఘా వ్యవస్థ, అగ్నిమాపక పరికరాలు, సందర్శకుల నమోదు పుస్తకం, తాళాల నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన అన్ని నిబంధనలు, ప్రమాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పాటించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గోదాం భద్రతపై నిరంతరం అప్రమత్తంగా ఉండటంతో పాటు రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) ఏ. నిర్మల, ఎన్నికల డీటీ జాఫర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# గండీడ్ మండల నూతన ఎమ్మార్వోకు వెన్నచెడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఘన సన్మానం

**గండీడ్, ప్రజాజ్యోతి:**
గండీడ్ మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మార్వో గారిని వెన్నచెడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత్ చెన్నయ్య శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, ప్రజలకు నాణ్యమైన పరిపాలనా సేవలు అందించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు. నూతన ఎమ్మార్వో నాయకత్వంలో మండల ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ , జీపీఓ శ్రీనివాస్, వార్డు సభ్యులు మేకల సాయిలు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ అల్లారి రామ్‌రెడ్డి, పెద్దాపురం చెన్నయ్యతో పాటు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొని నూతన ఎమ్మార్వో గారికి శుభాకాంక్షలు తెలియజేశారు.
మండల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సమర్థవంతమైన సేవలు అందిస్తూ గండీడ్ మండల అభివృద్ధికి విశేషంగా కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించా రు



# క్విట్ ఇండియా స్ఫూర్తితో జైల్ భరోకు సిద్ధం

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.

మండల కేంద్రంలోని కామ్రేడ్ నరసింహ కార్యాలయంలో సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం,రైతు సంఘం, ఆధ్వర్యంలో మండల సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు దేవేందర్ సీఐటీయూ మండల కన్వీనర్ బాల గౌడ్. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు వి. కృష్ణయ్య హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10 న వనపర్తి జిల్లా కేంద్రలో జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. 29 లేబర్ చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చి ఏప్రిల్ ఒకటి నుంచి దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్నారు. 8 గంటల పని దినాన్ని రద్దు చేస్తూ 12 గంటలకు పని దినాన్ని తీసుకురావడం,కార్మికులకు తీరని నష్టం చేసే విధంగా ఉన్నాయని వెంటనే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసి 29 కార్మిక చట్టాలని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దేశంలో నిరుపేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ చట్టాన్ని తీసివేసి వీబీ రాంజీ పేరుతో ఉపాధి హామీని నీరుగార్చే విధంగా రాష్ట్రం వాటా 40% ఇస్తే కేంద్రం వాట 60% జమ చేస్తామని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందని గత ప్రభుత్వాలు 90% కేంద్రం నుంచి నిధులు ఇచ్చే వాళ్ళని వెంటనే విబి రాంజీ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు కూలీలకు ఎంఎస్పి చట్టాన్ని అమలు చేయాలని గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. భారతదేశానికి స్వతంత్రం రాకముందు ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమని రగిలించి భారత దేశ ప్రజలను ఐక్యం చేసి బ్రిటిష్ వాళ్ళని ఈ దేశం నుంచి తరిమేసినరు, కానీ నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పోరేట్లకి కారు చౌకగా ప్రభుత్వ రంగ సంస్థలను భారతదేశం యొక్క భౌగోళిక స్వరూపాన్ని ధ్వంసం చేసే విధంగా కార్పొరేట్ సంస్థలకు ఇతర



దేశాలకు చౌకగా అమ్మేయడం జరుగుతుందని అందులో భాగంగానే భారతదేశ కార్మిక వర్గాన్ని వ్యవసాయ కూలీలను రైతాంగాని పరోక్షంగా బడా కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడే విధంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం విధానాలు తీసుకురావడం సరి అయినది కాదని ఈనెల 10న వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఖండించాలని కార్మికులకు పిలుపునివ్వడం జరిగింది. క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో భారతదేశ ప్రజల యొక్క మౌలిక హక్కులని కాపాడడం కోసం కార్మిక వర్గాన్ని నిలబెట్టడం కోసం ఎంతటి త్యాగానికైనా కార్మిక వర్గం ముందుండి పోరాడుతుందని ఇలాంటి మోడీలను ఎంతోమందిని ఇంటికి పంపిందని అలాంటి నరేంద్ర మోడీ కార్మికులతో చెలగాటమాడుతున్నాడని రాబోయే కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి కార్మికులు కర్షకులు గుణపాఠం చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆశన్న రైతు సంఘం నాయకులు తిరుపతయ్య. కాజా హుస్సేను సిహెచ్ వెంకటయ్య నక్క ఈశ్వర్ కావాలి శ్రీను పాల్గొన్నారు.


# వనపర్తికి రూ.241 కోట్ల ఐటీఐ హబ్

- క్లస్టర్-8 ఏఐపీ ప్రాజెక్టుకు టెండర్లు.. హబ్‌గా ప్రభుత్వ ఐటీఐ ఎంపిక
- నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా అవతరించనున్న వనపర్తి
- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి చొరవతో ఫలించిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టు

**వనపర్తి, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి):**

రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి రంగంలో వనపర్తికి మరో కీలక ప్రాజెక్టు దక్కింది. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో చేపట్టనున్న క్లస్టర్-8 అడ్వాన్స్‌డ్ ఇండస్ట్రియల్ పార్ట్‌నర్ ప్రాజెక్టుకు రూ.241 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ ప్రక్రియ ప్రారంభించింది. ఈ క్లస్టర్‌కు వనపర్తి ప్రభుత్వ ఐటీఐని హబ్‌గా ఎంపిక చేశారు. హబ్ పరిధిలో మన్ననూరు, మహబూబ్‌నగర్ బాలికల ఐటీఐ, డిండి, గద్వాల ప్రభుత్వ ఐటీఐలను అనుసంధానించి సమగ్ర నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ప్రాజెక్టు అమలుతో వనపర్తి రాష్ట్రంలోనే ప్రముఖ నైపుణ్య శిక్షణా కేంద్రంగా ఎదిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రాజెక్టులో భాగంగా అత్యాధునిక ల్యాబ్‌లు, ఆధునిక యంత్రాలు, డిజిటల్ తరగతి గదులు

ఏర్పాటు చేయడంతో పాటు రోబోటిక్స్, ఆటోమేషన్, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. పరిశ్రమలతో ప్రత్యక్ష అనుసంధానం ద్వారా విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్‌లు, క్యాంపస్ నియామకాలు, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ప్రభుత్వంతో ఎంపికయ్యే పరిశ్రమ భాగస్వామి ఐదేళ్లపాటు క్లస్టర్ నిర్వహణ బాధ్యతలు చేపట్టి మౌలిక వసతుల అభివృద్ధి, శిక్షణా నాణ్యత పెంపుతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన యువతను తీర్చిదిద్దనున్నారు. దీంతో గ్రామీణ యువతకు స్థానికంగానే ప్రపంచ స్థాయి నైపుణ్య శిక్షణ అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టు మంజూరుకు సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఇన్‌చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. 0




## ఆచార్య జయశంకర్ సేవలు చిరస్మరణీయం -చిన్నంబావి మండల ఎంపీడీఓ ఆదర్శ్ గౌడ్

**చిన్నంబావి, ఆగస్టు 6 (ప్రజా జ్యోతి )**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ సేవలు చిరస్మరణీయమని ఎంపీడీఓ ఆదర్శ్ గౌడ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి జయశంకర్ తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. స్వరాష్ట్ర సాధన కోసం జీవితకాలం కృషి చేసిన మహనీయుడని అన్నారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో వివిధ రంగాలకు చెందిన మేధావులు, ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకురావడంలో ఆయన కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రామస్వామి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, వెంకట్‌స్వామి, కంప్యూటర్ ఆపరేటర్లు సంపంగి ఈశ్వర్, నరేష్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇల్లు పెండింగ్ బిల్లును చెల్లించాలి



**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి)**

అలంపూర్ అయిజ మండలం టీ టీ దొడ్డి గ్రామానికి చెందిన గోవిందమ్మ కు ఇందిరమ్మ ఇల్లు మంజూరు ఐనది ఇంటి పనులుజరుగుతుండగా బిల్లులు రావడంలో ఆలస్యంఅవుతున్నాయని ఎంపీడీఓ కి ఎన్ని సార్లు చెప్పిన ఇంతవరకు ఇందిరమ్మ ఇళ్ల బిల్లు మంజూరు చెయ్యలేదని తక్షణమే ఎంపీడీఓ స్పందించి గోవిందమ్మ కు బిల్లు మంజూరు చెయ్యాలని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు. బిల్లు మంజూరు కానందున పేద కుటుంబం నిరుత్సాహంలో ఆత్మహత్య కు చేసుకోవడానికి కూడా వెనకాడకుండా పురుగుల మందు వెంటపెట్టుకొని కలెక్టర్ దగ్గర కి వచ్చారని. ఎంపీడీ ఓ వెంటనే స్పందించి గోవిందమ్మ కు ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లు వెంటనే మంజూరు చెయ్యాలని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ ఒక ప్రకటన లో తెలిపారు.

## విద్యార్థులు మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి:ప్రిన్సిపాల్ శ్రీలత రెడ్డి

ప్రభుత్వ జూనియర్ కళాశాల మల్దకల్‌లో అవగాహన కార్యక్రమం




**గద్వాల ఆగస్టు 06(ప్రజా జ్యోతి):**

ప్రభుత్వ జూనియర్ కళాశాల,మల్దకల్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం ప్రిన్సిపాల్ శ్రీలత రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ఇంటర్మీడియట్ దశ విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైనదని,ఈ వయసులో శారీరక,మానసిక మార్పులు సహజమని అన్నారు. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటూ శారీరకంగా,మానసికంగా దృఢంగా ఉండేందుకు సమతుల్య ఆహారం తీసుకోవడం,యోగా,వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) వైద్యులు డాక్టర్ విజయ్‌కాంత్,డాక్టర్ సాత్విన్ కౌశిర్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించడంతో పాటు,బాలికల ఆరోగ్య సమస్యలు,చిన్న వయసులో వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. అలాగే మత్తు పదార్థాలు,ధూమపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని,అవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రామాంజనేయులు గౌడ్,అధ్యాపకులు గోవర్ధన్ శెట్టి,భాగ్యలక్ష్మి, మాధురి,శ్రీకాంత్,రంగస్వామి,ఇష్తికర్ అహ్మద్‌తో పాటు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



# బోనాల వైభవంలో కుమ్మరి కుండకు విశిష్ట స్థానం

**- కుమ్మరి వృత్తికి ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం..**

**- ఘణపురంలో కుమ్మర్ల ఐక్యత సభలో నేతల డిమాండ్**





**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 6 (ప్రజాజ్యోతి):** బోనాల పండుగలో కుమ్మరి కుండకు ప్రత్యేక స్థానం ఉందని, హైదరాబాద్ గోల్కొండ బోనాలతో పాటు తొలి బోనం కూడా కుమ్మరి వర్గానికే దక్కడం వారి సంప్రదాయ వైభవానికి నిదర్శనమని కుమ్మరి సంఘం నాయకులు పేర్కొన్నారు. వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం మండల కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో గురువారం పద్మశాలి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కుమ్మర్ల ఐక్యత సభలో వారు మాట్లాడారు. కార్యక్రమానికి ముందు ఈదమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడి నుంచి పద్మశాలి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ చేపట్టారు. మండల అధ్యక్షుడు కుమ్మరి శ్రీను అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయానంద్, జిల్లా అధ్యక్షుడు సూగూరు రాములు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ.. కుమ్మరి వృత్తి పర్యావరణహితమైనదని, మట్టితో తయారుచేసే కుండలు, పాత్రలు, ప్రమిదలు, రంజన్లు భారతీయ సంస్కృతికి ప్రతీకలని అన్నారు. ప్లాస్టిక్, స్టీల్ పాత్రల వినియోగం పెరగడంతో సంప్రదాయ కుమ్మరి వృత్తి సంక్షోభంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మట్టి పాత్రల వినియోగం ఆరోగ్యానికి మేలు చేస్తుందని, ప్రజలు వాటిని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. మిషన్ కాకతీయ కింద చెరువుల పూడిక మట్టిని కుమ్మరులకు ఉచితంగా తవ్వుకొని రవాణా చేసుకునేలా ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలని, మైనింగ్, రెవెన్యూ శాఖల వేధింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కుమ్మరులకు ఎలక్ట్రిక్ చక్రాలు, ఉపాధి రుణాలు, ఉచిత విద్యుత్, వృత్తి బీమా, పింఛన్, విక్రయ కేంద్రాలు కల్పించాలని కోరారు. కుమ్మర ఫెడరేషన్, కార్పొరేషన్‌కు ఏటా రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయానంద్ మాట్లాడుతూ అంతరించిపోతున్న కుమ్మరి కులవృత్తులను ప్రభుత్వాలు ప్రత్యేకంగా ప్రోత్సహించాలని కోరగా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశ్వర్లు కుమ్మర కులస్తులకు అన్ని రాజకీయ పార్టీలు తగిన రాజకీయ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు సూగూరు రాములు "మట్టి పాత్రలు వాడుదాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం" అనే నినాదంతో ప్రజల్లో అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా, జిల్లా, మండల స్థాయి కుమ్మరి సంఘాల నాయకులు, మహిళా సంఘం ప్రతినిధులు, యువజన సంఘం నాయకులు, 15 మండలాల కుమ్మరి సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

# బిడ్డ కోరినప్పుడల్లా తల్లి పాలు ఇవ్వండి

## -వెల్లటూర్ గ్రామ సర్పంచ్ బెక్కెం సుజాతమ్మ ప్రతాప్ రెడ్డి



**చిన్నంబావి,ఆగస్టు 06 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండలం వెల్లటూరు గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రాలు 1, 2లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బెక్కెం సుజాతమ్మ, ప్రతాప్‌రెడ్డి,ఉప సర్పంచ్,వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు సుజాత, హేమలత, ఫిజియోథెరపిస్ట్ రమేష్, వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ బెక్కెం సుజాతమ్మ మాట్లాడుతూ.. తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని పేర్కొన్నారు. శిశువు పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలనే అందించడం ద్వారా శిశువుకు అవసరమైన పోషకాలు లభించడంతోపాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. తల్లిపాలు తాగే పిల్లల్లో అనేక అంటువ్యాధులు, పోషకాహార లోపం వంటి సమస్యలు తగ్గుతాయని అన్నారు.గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సమతుల్య పోషకాహారం తీసుకోవడంతోపాటు వైద్యులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది సూచనలు పాటించాలని సర్పంచ్ సూచించారు. తల్లిపాలను ప్రోత్సహించడం ప్రతి కుటుంబం బాధ్యతని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలే తొలి అడుగని పేర్కొన్నారు.అంగన్ వాడీ టీచర్లు సుజాత, హేమలత తల్లిపాల ప్రాముఖ్యత, శిశు సంరక్షణ, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న తల్లులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.అనంతరం సర్పంచ్ బెక్కెం సుజాతమ్మ, ప్రతాప్‌రెడ్డి అంగన్వాడీ చిన్నారులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు, మహిళలు పాల్గొని విజయవంతం చేశారు.

# జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు,ఇంటి స్థలాలు ఇవ్వాలి

**--టి.డబ్ల్యు.జె.ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ**

నాగర్‌కర్నూల్ ఆగస్టు 6 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)

రాష్ట్రంలో రాత్రింబవళ్లు ప్రజల కోసం శ్రమిస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని,వారి సంక్షేమానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టి.డబ్ల్యు.జె.ఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ డిమాండ్ చేశారు.గురువారం నాగర్‌కర్నూల్ ఉమ్మడి జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూరు వనమాలిక సీబీటీ సెంటర్‌లో నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రస్తావిస్తూ పలు కీలక డిమాండ్లు చేశారు.అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలి:రాష్ట్రంలో పనిచేస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఎలాంటి షరతులు లేకుండా తక్షణమే అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలి:ఏళ్ల తరబడి సొంతింటి కల నెరవేరని జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్లు లేదా ఇంటి స్థలాలు కేటాయించి వారి కలను సాకారం చేయాలని డిమాండ్ చేశారు.ఉచిత హెల్త్ కార్డులు ఇవ్వాలి:క్షేత్రస్థాయిలో నిరంతరం విధులు నిర్వహించే జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ వైద్యం అందేలా ఉచిత హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు.

రైల్వే రాయితీ పాస్‌లను పునరుద్ధరించాలి:విధి నిర్వహణలో భాగంగా తరచూ ప్రయాణాలు చేసే జర్నలిస్టుల కోసం రైల్వే రాయితీ పాస్‌లను వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

టి.డబ్ల్యు.జె.ఎఫ్ బలోపేతానికి పిలుపు:

జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం టి.డబ్ల్యు.జె.ఎఫ్ ఎల్లప్పుడూ ముందుంటుందని తాటికొండ కృష్ణ స్పష్టం చేశారు. సంఘం బలోపేతానికి నాయకులు, ప్రతినిధులు, సభ్యులందరూ ఐక్యంగా కృషి చేయాలని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఐకమత్యంతో ముందుకు సాగి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. టి.డబ్ల్యు.జె.ఎఫ్ ఏ రాజకీయ పార్టీకి అనుబంధ సంస్థ కాదని, కేవలం జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం పనిచేసే సంఘమని స్పష్టం చేశారు. సంఘం బలోపేతానికి ప్రతి జర్నలిస్టు సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సి. రామచంద్రయ్య, బి. జ్ఞానేశ్వర్, వనపర్తి జిల్లా అధ్యక్షుడు రాము, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, గద్వాల జిల్లా నాయకులు రంగముని, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎ. పరిపూర్ణం, ప్రధాన కార్యదర్శి పి. వెంకటస్వామి, కోశాధికారి బాదం పరమేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ హౌదేకర్ నవీన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని వివిధ పత్రికలకు చెందిన టి.డబ్ల్యు.జె.ఎఫ్ ప్రతినిధులు, విలేకరులు పాల్గొన్నారు.ఇది వార్తా ప్రచురణకు అనువుగా భాషా, వ్యాకరణ, విరామ చిహ్నాల పరంగా సవరించిన రూపం. అవసరమైతే ఇంకా ఆకర్షణీయమైన శీర్షిక, ఉపశీర్షికతో కూడా సిద్ధం చేస్తాను.




# వ్యవసాయ భూమి వివాదం

## -మహిళపై దాడి,ముగ్గురిపై కేసు

అంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి), ఆగస్టు 6:జోగులాంబ గద్వాల జిల్లా కొండందాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాసనూలు గ్రామంలో వ్యవసాయ భూమి వివాదం నేపథ్యంలో మహిళపై దాడి జరిగిన ఘటనలో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కొండదాపూర్ పోలీసులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం,పూర్వీకుల వ్యవసాయ భూమి పంపకాలపై గత కొంతకాలంగా గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ కొనసాగుతోంది.వివాదం పూర్తిగా పరిష్కారమయ్యే వరకు సంబంధిత భూమిలో ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టరాదని నిర్ణయించినప్పటికీ, గురువారం (ఆగస్టు 6) మధ్యాహ్నం కొందరు వ్యక్తులు వివాదాస్పద స్థలంలో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించినట్లు ఆరోపణలు ఉన్నాయి.దీనిపై బాధితురాలు అభ్యంతరం వ్యక్తం చేయగా,నిందితులు ఆమెతో వాగ్వాదానికి దిగడమే కాకుండా అసభ్య పదజాలంతో దూషించి శారీరకంగా దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఘటనలో బాధితురాలికి కంటి భాగం,కడుపు,కాళ్లకు గాయాలయ్యాయని తెలిపారు.కుటుంబ సభ్యులు,బంధువులు వెంటనే అక్కడికి చేరుకుని ఆమెను రక్షించారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు వెంకట రాములు,లక్ష్మీ పార్వతి,బాబులపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.భూ వివాదాలకు సంబంధించిన సమస్యలను చట్టబద్ధమైన మార్గాల్లో,రెవెన్యూ,న్యాయ అధికారుల ద్వారా పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు.చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులు,బెదిరింపులు లేదా శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కొండదాపూర్ పోలీసులు హెచ్చరించారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్, ఆగస్టు 6 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ దరావత్ జానకితో కలిసి గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో టెంట్ల ఏర్పాటు, ప్రధాన వేదిక నిర్మాణం, వీఐపీ, ప్రజాప్రతినిధులు, అధికారుల సీటింగ్ ఏర్పాట్లు, పరేడ్ నిర్వహణ, కార్యక్రమాల క్రమం, శకటాల ప్రదర్శన, వివిధ ప్రభుత్వ శాఖల స్టాళ్ల ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత ఏడాది చేసిన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, అవసరమైన చోట మార్పులు చేసి ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వర్షం కురిసే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో కూడిన ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు.
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఎలాంటి అంతరాయాలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు.
ఈ పరిశీలనలో ఆర్‌డీఓ నవీన్, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరామ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తెప్ప శ్రీనివాస్ కు సన్మానం

## -హర్షం వ్యక్తం చేసిన లయన్స్ క్లబ్ సభ్యులు




**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 06 (ప్రజా జ్యోతి)**
లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320 ఆధ్వర్యంలో బుధవారం సికింద్రాబాద్ లోని లయన్స్ భవన్లో యశోత్సవ్ అవార్డ్స్ నైట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో సేవలందించిన లైన్స్ సభ్యులకు డిస్టిక్ గవర్నర్ లయన్ డాక్టర్. మహేందర్ రెడ్డి మరియు పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ సునీల్ కుమార్ చేతుల మీదుగా అవార్డులతో సన్మానించారు.ఈ సందర్బంగా లయన్ డాక్టర్. తెప్ప శ్రీనివాస్ లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320 మార్షియల్ ఆర్ట్స్ డిస్టిక్ చైర్ పర్సన్ గా ఉండి గత 40 సంవత్సరాలుగా తైక్వాండో,మార్షల్ ఆర్ట్స్ ద్వారా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా పేదలైన విద్యార్థిని-విద్యార్థులకు తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ నేర్పుతూ క్రమశిక్షణతొ జిల్లా,రాష్ట్ర,అంతర్జాతీయ స్థాయిలో వారికి గుర్తింపు తెచ్చి విజేతలుగా నిలపడంలో విశేషంగా కృషి చేస్తూనే అనేక సమాజసేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు ఇంటర్ నేషనల్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ తెప్ప శ్రీనివాస్ ను అవార్డుతో ఘనంగా సత్కరించారు. శ్రీనివాస్ కు అవార్డు రావడంతో లయన్స్ క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేసారు.

# ఆగస్టు 10న జరుగు జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## సిఐటియు జిల్లా నాయకులు బండపల్లి శివరాములు

వంగూర్ ఆగస్టు 6 (ప్రజా జ్యోతి)
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలంలో క్విట్ ఇండియా స్ఫూర్తితో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు కూలీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాలు రైతు కూలి సంఘాలు దేశవ్యాప్తంగా ఇచ్చిన జైల్ బరో పిలుపుమేరకు ఆగస్టు 10న కల్వకుర్తిలో జరుగు జైల్ బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు బండపల్లి శివరాములు కార్మికులకు కూలీలకు రైతులకు పిలుపునిచ్చారు. ఆయన గురువారం వంగూరు మండల అభివృద్ధి అధికారి శారద కు గ్రామపంచాయతీ కార్మిక లతో కలిసి వినతి పత్రాన్ని7 అందజేశారు .అనంతరం శివరాములు మాట్లాడుతూ కేంద్రం ఉన్న బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ కార్మికుల హక్కులను కాల రాస్తుందని విమర్శించారు .స్వాతంత్రం రాకముందు ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి యజమాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందని అన్నారు.కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో స్కీం వర్కర్స్ గా పని చేస్తున్న ఆశ అంగన్వాడి వివో ఏ ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామపంచాయతీ తదితర రంగాల కార్మికులు సంవత్సరాల తరబడి కనీస వేతనాలు 26,000 ఉద్యోగ భద్రత ప్రమాద బీమా పిఎఫ్ ఈఎస్ఐ రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సౌకర్యాలు కల్పించకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెట్టి చాకిరి చేయించుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.రోజురోజుకు తిరుగుతున్న ధరలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు.నిత్యవసర వస్తువుల ధరలను పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజల గడ్డి విరుస్తుందని అన్నారు. రైతులకు గిట్టుబాటు రేటు కల్పించాలని స్వామినాథన్ సిఫారసులను తుంగలో తొక్కిందని అన్నారు. దేశంలోకి వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి ఎలాంటి సుంకాలను విధించకుండా స్వేచ్ఛ మార్కెట్లను ఆహ్వానించి దేశీయ ఉత్పత్తి దారులైన రైతులకు తీవ్రమైన నష్టాన్ని చేకూరుస్తుందని అన్నారు రాష్ట్రాల పరిధిలో ఉన్న విద్యుత్తును కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకొని రాష్ట్రాలకు విద్యుత్ పై ఎలాంటి హక్కులు లేకుండా చేస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరం నిరుద్యోగులకు రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన బిజెపి ప్రభుత్వం 12 సంవత్సరాలుగా అధికారంలో ఉండి ఉన్న ఉద్యోగాలనే ఊడగొట్టిందని అన్నారు. కూలీలకు చట్టపరంగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మార్చి కూలీలకు ఉపాధి లేకుండా చేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం యొక్క నిరంకుశ పోకలను అరికట్టడానికి కార్మికులు ఉద్యోగులు రైతులు ప్రజలు కూలీలు నిరుద్యోగులు విద్యార్థులు మేధావులు జైలు బరో కార్యక్రమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి కళ్ళు తెరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు అక్కిన మోని రాఘవేందర్, మండల నాయకులు వెంకటయ్య ,బండపల్లి కృష్ణయ్య, బాలనారాయణ, స్వామి, గ్రామపంచాయతీ కార్మికులు పర్వతాలు, లక్ష్మమ్మ ,అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.



# గుడిపల్లి రిజర్వాయర్కు నీరు విడుదల

## -హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



**నాగర్ కర్నూల్ : ఆగస్టు 06 (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూల్ మండలం గుడిపల్లి గ్రామ సమీపంలోని కల్వకుర్తి ఎత్తిపోతల పథకం గుడిపల్లి గట్టు రిజర్వాయర్ కు నీటిపారుదల శాఖ అధికా రులు గురువారం శ్రీశైలం జలాశయం బ్యాక్ వాటర్ నీటిని విడుదల చేశారు.దీంతో రిజర్వాయర్ నీటితో కళకళలాడుతోంది. రిజర్వాయర్ లోకి సాగునీరు వస్తుందడంలో ఆయాకట్టు రైతులు,పరిసర గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



**మహమ్మదాబాద్, ఆగస్టు 6 (ప్రజా జ్యోతి):**
తెలంగాణ రాష్ట్ర సాధనకు సిద్ధాంతకర్తగా, ఉద్యమానికి మేధోబలంగా నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా మహమ్మదాబాద్ మండల కేంద్రంతో పాటు నంచర్ల, గాదిర్యాల్, ముందలి తండా గ్రామపంచాయతీల్లో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం చేసిన ఆయన త్యాగం, దూరదృష్టి, సిద్ధాంతాలు తరతరాలకు ఆదర్శప్రాయమని కొనియాడారు.
తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత వ్యక్తిగా ప్రొఫెసర్ జయశంకర్‌ను అభివర్ణిస్తూ, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు

## -పోలీసుల దాడిలో ఏడుగురు అరెస్ట్

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 06 (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూలు జిల్లాలో నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్న ఏడుగురిని బిజినపల్లి పోలీసులు అరెస్టు చేశారు.డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మంగనూరులోని ఒక వైన్స్ లో నకిలీ నోట్లతో కొనుగోలు చేస్తుండగా విషయం ఎరుగులోకి వచ్చిందని,68 వేల రూపాయల నకిలీ నోట్లు, కలర్ జిరాక్స్,కౌంటర్ మిషన్లను సీజ్ చేయడం జరిగిందని,రూ.1,000 అసలు నోట్లకు 4,000 నకిలీ కరెన్సీని ఇంస్టాగ్రామ్ ద్వారా ఒప్పందం చేసుకొని తెచ్చుకున్నట్లు దర్యాప్తులో తేలిందని డిఎస్పీ తెలిపారు.



# ప్రధాన ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి..

### జాప్యానికి తావులేకుండా చర్యలు : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, ఆగస్టు 6 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
జిల్లాలో అమలవుతున్న భారత్‌మాల జాతీయ రహదారులు, రైల్వే లైన్ డబ్లింగ్, టీజీఐఐసీ బ్రహ్మోస్ మిస్సైల్ పరిశ్రమ, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు తదితర కీలక ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ గత సమావేశంలో ఇచ్చిన ఆదేశాల అమలుపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. భారత్‌మాల జాతీయ రహదారి ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పరిహారం చెల్లింపులు, మ్యుటేషన్ ప్రక్రియ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వివరాలు అందుబాటులో లేని రైతుల సమాచారాన్ని మండల తహసీల్దార్లు పత్రికా ప్రకటనలు, రైతు భరోసా జాబితాల ద్వారా సేకరించి పెండింగ్ చెల్లింపులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వివాదాస్పద భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించి పరిహారం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని సూచించారు. రైల్వే లైన్ డబ్లింగ్‌కు అవసరమైన భూసేకరణలో అవార్డులు, విచారణలు, పెండింగ్ ప్రక్రియలను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని, ప్రజల అభ్యంతరాలు ఉన్న ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రైల్వే అధికారులు, రెవెన్యూ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని చెప్పారు.దేవరకద్ర మండలంలో ఏర్పాటు కానున్న బ్రహ్మోస్ క్షిపణి తయారీ పరిశ్రమకు అవసరమైన భూసేకరణ పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల వారీగా నెగోషియేషన్ సమావేశాలు నిర్వహించి రైతులు, ప్రజాప్రతినిధులతో చర్చించి త్వరితగతిన నిర్ణయానికి రావాలని సూచించారు. సర్వే పనులు దాదాపు పూర్తయ్యాయని, మార్కెట్ విలువలు ఖరారైన వెంటనే ప్రతిపాదనలు సమర్పిస్తామని అధికారులు తెలిపారు. అమరరాజా బ్యాటరీస్ కంపెనీకి జాతీయ రహదారి అనుసంధానం కోసం అవసరమైన భూసేకరణ



అంశాలను కూడా కలెక్టర్ సమీక్షించారు. రోడ్డు అలైన్‌మెంట్‌పై ఉన్న అభ్యంతరాలను సంబంధిత సంస్థ ప్రతినిధులతో చర్చించి పరిష్కరించాలని, ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు లేని సుమారు 63 ఎకరాలను ముందస్తు స్వాధీనం ద్వారా అప్పగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన భూసేకరణ, డిక్లరేషన్లు, అవార్డులు, పరిహారం చెల్లింపుల పురోగతిని సమీక్షించారు. పెండింగ్ డిక్లరేషన్లు, అవార్డులను నిర్ణీత గడువులో పూర్తి చేసి రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఉదండాపూర్ రిజర్వాయర్ పునరావాసం, పునర్నిర్మాణం (ఆర్అండ్ఆర్) పనులపై కూడా సమీక్ష నిర్వహించిన కలెక్టర్, పెండింగ్ అవార్డులు, పరిహారం చెల్లింపులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రధాన అభివృద్ధి ప్రాజెక్టులు ఎలాంటి జాప్యం లేకుండా ముందుకు సాగేలా రెవెన్యూ, జాతీయ రహదారులు, రైల్వే, ఇరిగేషన్, టీజీఐఐసీ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్‌రెడ్డి, ఆర్‌డీఓ నవీన్, జాతీయ రహదారుల శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులు, మండల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు ఘన నివాళులు

### గండీడ్ మండల కేంద్రంలో ఘనంగా జయంతి వేడుకలు..
### ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపు

గండీడ్, ప్రజాజ్యోతి: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అంకితభావంతో పోరాడి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి వేడుకలను గురువారం గండీడ్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించిన నాయకులు, ఆయన తెలంగాణ కోసం చేసిన సేవలను కొనియాడారు. జయశంకర్ సార్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని, సమాజ అభివృద్ధికి ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గండీడ్ గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ పీసీసీ సెల్ అధ్యక్షుడు కృష్ణపూర్ రాజన్న, గ్రామ



ఉపసర్పంచ్ గుమ్ముల చెన్నయ్య, గండీడ్ గ్రామ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు, గండీడ్ మండల బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి రాయికం కేశవులు (లెక్చరర్), ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు పెరిగోల్ బోరు కృష్ణయ్య, గండీడ్ మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు హుస్నాబాద్ వెంకటయ్య, చెన్నయ్యపల్లి గ్రామ మాజీ సర్పంచ్ వెంకటయ్య, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు చిట్టపల్లి మల్లయ్య, కొమ్ము అనిల్, అమ్మతమ్మ, కారోబార్ వెంకటయ్య, చెన్నప్ప, కిష్టయ్య, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.
జయశంకర్ సార్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్న నాయకులు జయశంకర్ సార్ సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## వీరశైవ జంగమ అర్చకుల హక్కుల సాధనే లక్ష్యం

### రాష్ట్ర సంఘంలో ఉమ్మడి పాలమూరు అర్చకులకు కీలక బాధ్యతలు

మహబూబ్‌నగర్, ఆగస్టు 6 ( ప్రజా జ్యోతి బ్యూరో ): తెలంగాణ రాష్ట్ర ధూపదీప నైవేద్య వీరశైవ జంగమ అర్చక సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు అర్చకులు కీలక పదవులకు ఎన్నికయ్యారు. భువనగిరి జిల్లా కొలనుపాకలోని శ్రీ సోమేశ్వర స్వామి పుణ్యక్షేత్రంలో నిర్వహించిన రాష్ట్ర మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా మదిగట్ల మడపతి బుచ్చిలింగం, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఆలంపల్లి మల్లేష్ స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వనపర్తికి చెందిన సురేష్ కుమార్ శాస్త్రి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బాలింగయ్య, చక్రిస్వామి, గద్వాల శ్రీకాంత్, ఎల్కూర్ పరమేశ్వరయ్య, నారాయణపేట నాగరాజు స్వామి, సునీల్ స్వామి, విశ్వనాథ్ స్వామిలకు చోటు కల్పించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ధూపదీప నైవేద్య పథకం పరిధిలో సుమారు 6,700 మంది అర్చకులు ఉండగా, వారిలో 2,432 మంది వీరశైవ జంగమ అర్చకులు సేవలందిస్తున్నట్లు తెలిపారు. వీరశైవ ఆగమ సంప్రదాయాల ప్రకారం అధిక సంఖ్యలో అర్చకులు ఆలయాల్లో సేవలు అందించడం గర్వకారణమని పేర్కొన్నారు. వీరశైవ జంగమ అర్చకుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరిపి సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఇతర కుల సంఘాలకు ఉన్నట్లే వీరశైవ జంగమ సమాజానికి ప్రత్యేకంగా జంగమ పరిషత్ ఏర్పాటు చేయించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని వెల్లడించారు. రాష్ట్ర అధ్యక్షుడు గొంగల్లా మఠం రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి సదా నిరంజన్ సిద్ధాంతి నాయకత్వంలో అర్చకుల హక్కులు, సంక్షేమం, సామాజిక గౌరవం కోసం అహర్నిశలు శ్రమించి ప్రభుత్వ సహకారం సాధించే దిశగా సంఘం పని చేస్తుందని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.



## భారత్‌మాల భూ నిర్వాసితులు పరిహారం పొందేందుకు ముందుకు రావాలి



మహబూబ్‌నగర్, ఆగస్టు 6 ( ప్రజా జ్యోతి బ్యూరో ):
భారత్‌మాల జాతీయ రహదారి నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం సేకరించిన భూములకు సంబంధించి ఇంకా నష్టపరిహారం పొందని భూ యజమానులు వెంటనే రెవెన్యూ అధికారులను సంప్రదించాలని మహబూబ్‌నగర్ రూరల్ తహసీల్దార్ బక్క శ్రీనివాస్ సూచించారు. కోడూరు, ఓబులాయపల్లి, అప్పయ్యపల్లి గ్రామాలకు చెందిన మొత్తం 93 మంది భూ పట్టాదారులు ఇప్పటివరకు భూ సేకరణ పరిహారం పొందలేదని ఆయన తెలిపారు. సంబంధిత భూ యజమానులు తమ భూములకు సంబంధించిన అవసరమైన పత్రాలతో మహబూబ్‌నగర్ రూరల్ తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించి, పరిహారం పొందేందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారుఈ విషయమై మరిన్ని వివరాల కోసం కార్యాలయంలోని ఆర్ఐ రహీమ్ 9849291575 మరియు ఆర్ఐ చంద్రకాంత్ 9949977019లను నేరుగా సంప్రదించాలని ఎమ్మార్వో శ్రీనివాస్ తెలిపారు. అర్హులైన ప్రతి భూ యజమానికి నష్టపరిహారం అందేలా రెవెన్యూ శాఖ చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు.

## హోంగార్డ్ కుటుంబానికి 5 లక్షల ఎక్స్గ్రేషియా చెక్కు



**నాగర్ కర్నూల్ : ఆగస్టు 06 (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహించిన దివంగత హోంగార్డ్ జి. దశరథం కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 5 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్కును జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ గురువారం దశరథం సతీమణి సుజాతకు అందజేశారు.విధి నిర్వహణలో సేవలందించిన హోంగార్డు దశరథం కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు.

## బిజనపల్లి ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 06 (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూల్ నియోజకవర్గంలోని బిజినపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్య కళాశాల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలకార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్బంగా వైద్యాధికారి డాక్టర్.పి.సృజన ప్రసవం తర్వాత గంటలోపు వచ్చే ముర్రుపాల ప్రాముఖ్యతను,తల్లి బిడ్డల అనుబంధాన్ని,వ్యాధినిరోధక శక్తిని పెంచి,శిశువు పెరుగుదల ప్రాముఖ్యతను తల్లులకు,గర్భవతులకు వివరిస్తూ పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడంవల్ల తల్లుల ఆరోగ్యం రొమ్ము క్యాన్సర్లు నివారణ,గర్భాశయం యధాస్థానం రావడం,తల్లి బిడ్డకు ఆరోగ్యదాయకమన్నారు.అనంతరం మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.భావన లక్మి,డా.అరుంధతి తల్లిపాల ప్రాము ఖ్యతను వివరించారు. ఈకార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ సుభాషిణి,జయశిల,మాస్టర్ ఆఫ్ సోషల్ వర్కర్ బాలమ్మ ,పర్యవేక్షకులు చంద్ర శేఖర్,గంగా,నాగయ్య,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

